## క్లుప్తంగా

### నేడు మాజీ సీఎం వైఎస్సార్ వర్ధంతి

నూజివీడు/ఆగిరిపల్లి: నూజివీడు పట్టణంలోని చిన్నగాంధీబొమ్మ సెంటర్‌లో, ఆగిరిపల్లి బస్టాండ్ సెంటర్‌లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 16వ వర్ధంతిని మంగళవారం ఉదయం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ కార్యాలయ వర్గాలు సోమవారం ఓ ప్రకటనలో తెలిపాయి. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

### మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ పరామర్శ

ఆగిరిపల్లి: మండలంలోని అడవినెక్కలం, కనసానపల్లిలో ఇటీవల అనారోగ్యంతో మరణించిన కార్యకర్తల కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ సోమవారం అప్పారావు పరామర్శించారు. అడవినెక్కలంకు చెందిన యలమర్తి మరియమ్మ, కనసానపల్లికి చెందిన నల్లమోతు ఝాన్సీ, దాసరి రంగమ్మ కొన్ని రోజుల క్రితం మరణించడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటానని ప్రతాప్ భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఏలూరు జిల్లా వైఎస్సార్ సీపీ ఉపాధ్యక్షుడు పల్లగాని నరసింహారావు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ మచ్చా హరిబాబు, జెడ్పీటీసీ పిన్నిబోయిన వీరబాబు, ఎంపీటీసీ గుర్రం శ్రీనివాసరావు, సర్పంచ్‌లు వేము రాజు, లింగవరపు రమేష్, నాయకులు పాల్గొన్నారు.

### నీట్‌లో ప్రతిభ చాటిన విద్యార్థులు

ఆగిరిపల్లి: ఇటీవల విడుదలైన నీట్ ఫలితాల్లో మండలానికి చెందిన విద్యార్థులు ప్రతిభ చాటారు. కృష్ణవరానికి చెందిన మసిముక్కు వీరేంద్రనాథ్ నీట్ పరీక్ష ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 704 ర్యాంకు సాధించి సిద్ధార్థ వైద్య కళాశాలలో సీట్ సాధించారు. ఆగిరిపల్లికి చెందిన సర్నాల రిషేంద్ర శోభన్ రాష్ట్రస్థాయిలో 2,259 ర్యాంకు సాధించి కడప రిమ్స్ వైద్య కళాశాలలో సీటు సాధించారు. వీరి ఇరువురి తల్లిదండ్రులు ఉపాధ్యాయులు కావడం విశేషం. వీరిని మండలానికి చెందిన ఉపాధ్యాయులు అభినందించారు.

# పీజీఆర్ఎస్‌కు 37 అర్జీలు

నూజివీడు: ప్రజల నుంచి వచ్చిన అర్జీల పరిష్కారంలో అధికారులు అలసత్వం వహించొద్దని సబ్‌కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న పేర్కొన్నారు. పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం సబ్‌కలెక్టర్ ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. ప్రజల నుంచి 37 అర్జీలు రాగా వాటిని సంబంధిత అధికారులకు పంపారు. కార్యక్రమంలో ఏడీఏ జి.విద్యాసాగర్, ఏఎస్‌డబ్ల్యూఓ డి.శ్రీనివాసరావు, హెచ్‌ఓ ఆర్ హేమ, కోఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


అర్జీదారుని సమస్య తెలుసుకుంటున్న నూజివీడు సబ్‌కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న

# దివ్యాంగులకు కృత్రిమ కాళ్లు వితరణ


దివ్యాంగులకు కృత్రిమ కాళ్లను అందజేస్తున్న దాతలు

ఆగిరిపల్లి: మండలంలోని తోటపల్లి హీల్ అవయవ కేంద్రంలో ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాలకు చెందిన 15 మంది దివ్యాంగులకు కృత్రిమ కాళ్లను దాతల సహకారంతో అందజేసినట్లు హీల్ సంస్థ సీఈఓ కూరపాటి అజయ్ కుమార్ తెలిపారు. గుంటూరుకు చెందిన చుండూరి కోటయ్య– రామశేషమ్మ చారిటబుల్ ట్రస్ట్ వారి ఆర్థిక సహాయంతో కృత్రిమ కాళ్లను అందజేశారు. సంఘ సేవకులు మండవ వెంకటేశ్వరరావు, త్రిపురనేని శ్రీనివాస్, హెచ్ఎం లతా చౌదరి, టెక్నీషియన్ చిన్నా, పాల్గొన్నారు.

## గిరిజనుల అభివృద్ధికే ఆది కర్మయోగి మిషన్

నూజివీడు: గిరిజనుల అభివృద్ధికి గ్రామ స్థాయిలో మార్పు తీసుకురావాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఆది కర్మయోగి మిషన్ చేపట్టిందని భారత ప్రభుత్వ గిరిజన వ్యవహారాల మంత్రిత్వశాఖ ప్రతినిధి మనీషా రెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోని స్త్రీశక్తి భవనంలో సోమవారం ఆది కర్మయోగి కార్యక్రమంపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఎంపీడీఓ చెన్నా రాఘవేంద్రనాథ్, తహసీల్దార్ గుగులోతు బద్రూనాయక్ ప్రారంభించారు. శిక్షణ తరగతుల్లో ఎంఈఓ జమలయ్య, జిల్లా మాస్టర్స్ ట్రైనర్లు, సిద్ధార్థనగర్, ఓగిరాల తండా, కొత్తూరు తండా, వెంకటాయపాలెం పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆలయాల హుండీ కానుకల లెక్కింపు

నూజివీడు: పలు ఆలయాల్లో హుండీ కానుకలను లెక్కించినట్లు ఈఓ అలివేణి సోమవారం తెలిపారు. శ్రీ వేంకటాచల స్వామివారి దేవస్థానం 4 నెలలకు రూ.2,53,133, శ్రీదాసాంజనేయ స్వామివారి ఆలయం రూ.36,961, శ్రీదుర్గామల్లేశ్వర స్వామివారి ఆలయం రూ.77,794, శ్రీకోట మహిషాసుర మర్దని అమ్మవారి ఆలయం హుండీ ఆదాయం రూ.2,98,564 వచ్చిందన్నారు.

## అధ్యాపకుల నైపుణ్య అభివృద్ధికి ప్రాముఖ్యత

ఆగిరిపల్లి: పోతవరప్పాడు ఎస్ఆర్ఐ ఇంజినీరింగ్ కళాశాలలో ఏఐసీటీఈ–అటల్ అను అంశంపై ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ శిక్షణా కార్యక్రమాన్ని ఎస్ఆర్ఐ కళాశాల చైర్మన్ రావి వెంకట్రావు ప్రారంభించారు. ఈనెల 6వ తేదీ వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న ఇంజినీరింగ్ కళాశాలలోని అధ్యాపకులు పాల్గొంటారని, ఏఐ రంగంలోని తాజా పరిశోధనలు, డిజైన్ టెక్నిక్స్, ఫ్యాబ్రికేషన్ అంశాలపై శిక్షణ నిర్వహించబడుతుందని చెప్పారు.

## నిబంధనల మేరకు ఎరువులు, పురుగు మందులను విక్రయించాలి

నూజివీడు: నిబంధనలకు లోబడి ఎరువులు, పురుగు మందులను విక్రయించాలని మండలంలోని దుకాణాదారులను ఏఓ పలగాని చెన్నారావు ఆదేశించారు. స్థానిక వ్యవసాయాధికారి కార్యాలయంలో మండలంలోని ఎరువుల దుకాణదారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డీలర్లు తమ దుకాణం వద్ద స్టాక్ బోర్డు నిర్వహించాలని, అధిక ధరలకు ఎరువులు, పురుగుమందులు విక్రయిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులకు యూరియా కొరత ఏమీ లేదని, ఖరీఫ్‌లో పంటల సాగు కొరకు ఇప్పుడే రైతులు కొనుగోలు చేసి నిల్వ చేయవద్దని సూచించారు.

## క్లుప్తంగా

### పోలీస్ గ్రీవెన్స్‌కు 83 ఫిర్యాదులు



లబ్బీపేట(విజయవాడతూర్పు): ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 83 ఫిర్యాదులు అందాయి. జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు ఆదేశాల మేరకు డీసీపీ ఏబీటీఎస్ ఉదయరాణి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా మొత్తం 83 ఫిర్యాదులు రాగా, వాటిలో భూ వివాదాలు, ఆస్తి వివాదాలు, నగదు లావాదేవీలకు సంబంధించినవి 35, భార్యాభర్తలు, కుటుంబ కలహాలకు సంబంధించినవి 4, కొట్లాటలపై 2, వివిధ మోసాలపై 4, మహిళా సంబంధిత నేరాలపై 20, దొంగతనాలకు సంబంధించి 3, ఇతర చిన్న వివాదాలపై 15 ఫిర్యాదులు అందాయి. కాగా ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను సంబంధిత ఎస్‌హెచ్‌ఓలకు పంపి, సత్వరమే చర్యలు తీసుకోవాలని డీసీపీ ఆదేశించారు.

### మెర్న్ ఫుల్ స్టాక్ టెక్నాలజీస్‌పై శిక్షణ ప్రారంభం

మైలవరం: మెర్న్‌ఫుల్ స్టాక్ టెక్నాలజీస్ ఆధునిక వెబ్ అప్లికేషన్స్‌లను నిర్మించడానికి అత్యంత శక్తివంతమైన పర్యావరణ వ్యవస్థలలో ఒకటి అని లీన్ టెక్ ల్యాబ్స్ సీఈఓ, సహ వ్యవస్థాపకుడు ఆర్.అభిషేక్ తెలిపారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో తృతీయ సంవత్సరం విద్యార్థులకు మెర్న్(ఎమ్ఈఆర్ఎన్) ఫుల్ స్టాక్ టెక్నాలజీస్‌పై రెండు వారాల శిక్షణా కార్యక్రమం స్కేలో సొల్యూషన్స్ ఆధ్వర్యంలో సోమవారం ప్రారంభించారు. ప్రాజెక్టుల నిర్మాణంతో పాటు ప్రతి విద్యార్థి ఫుల్ స్టాక్‌అప్లికేషన్ డిజైన్ చేసే విధంగా విద్యార్థుల విశ్వాసాన్ని పెంపొందిస్తామన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అప్పారావు, సీఎస్ఈ విభాగాధిపతి, కన్వీనర్ డాక్టర్ ఎస్.నాగార్జున రెడ్డి ప్రసంగించారు. రిసోర్స్‌పర్సన్‌గా ఆర్.అభిషేక్, కో కన్వీనర్స్‌గా డీన్ ఐఅండ్ ఆర్ డాక్టర్ వి. సూర్యనారాయణ, డీన్ అకాడమిక్స్ డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, డాక్టర్ డీ.వీరయ్య, డాక్టర్ వై.విజయభాస్కరరెడ్డి వ్యవహరించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### చెల్లని చెక్కు కేసులో జైలు శిక్ష

చిలకలపూడి(మచిలీపట్నం): చెల్లని చెక్కు కేసులో కార్పొరేషన్ ఉద్యోగికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పి. సాయిసుధ సోమవారం తీర్పు చెప్పారు. మచిలీపట్నంకు చెందిన తాడిశెట్టి వెంకటకృష్ణారావు నగరపాలక సంస్థలో పనిచేస్తున్న కళా కేశవ అనే ఉద్యోగి 2020 జనవరి 5న రూ.5 లక్షలు అప్పుగా తీసుకున్నారు. అప్పు తీర్మానం నిమిత్తం 2021 జూన్ 21వ తేదీన రూ.4 లక్షలు ఆంధ్రాబ్యాంక్ చెక్కును అందజేశారు. ఆ చెక్కును వెంకటకృష్ణారావు మచిలీపట్నంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో డబ్బులు వసూలు నిమిత్తం దాఖలు చేయగా చెక్కు నగదు లేదని తిరస్కరించారు. దీనిపై కేశవకు కృష్ణారావు నోటీసు పంపినా స్పందించకపోవటంతో కోర్టులో కేసు దాఖలు చేశారు. అనంతరం న్యాయమూర్తి ఇరువర్గాల వాదనలు విన్న తరువాత న్యాయమూర్తి సాయిసుధ ఉద్యోగి కళా కేశవకు ఆరు నెలలు జైలు శిక్ష, రూ.4 లక్షలు జరిమానా విధించి తాడిశెట్టి వెంకటకృష్ణారావుకు నగదు చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు.

# రాజీనామా బాటలో రేషన్ డీలర్లు!

- కష్టం చేయలేమంటూ మనోవేదన
- కమీషన్ పెంచాలని వినతి



ఈ ఏడాది జూన్ ఒకటో తేదీన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌తో కలిసి రేషన్ అందజేస్తున్న డీలర్ భర్త (ఫైల్)

పెడన: కొందరు రేషన్ డీలర్లు రాజీనామాల బాటలో పయనిస్తున్నారు. కూటమి ప్రభుత్వంలో వెట్టిచాకిరీ తాము చేయలేమని తేల్చి చెబుతున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఎంతో ప్రశాంతంగా ఉన్న తాము కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అష్టకష్టాలు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇచ్చే కమీషన్ అతి తక్కువగా ఉంటుందని... తమతో చేయించే పని ఎక్కువగా ఉంటుందని వాపోతున్నారు. కమీషన్ పెంచాలని ప్రభుత్వానికి విన్నవించినా ఫలితం ఉండటం లేదని అంటున్నారు. ఎప్పటికి పెంచుతారో కూడా అర్థంకాని పరిస్థితి నెలకొందని చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రస్తుతం ఉన్న పని చేయడం కష్టమని, తప్పుకోవడమే మేలని వెల్లడిస్తున్నారు. పెడన పట్టణంలో జూన్ నెలలో ఎంతో ఆర్భాటంగా ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ ప్రారంభించిన షాపు నెంబరు ఏడు డీలరు ఐవీ పద్మవతి రాజీనామా చేశారు. ఈ షాపును విజేత డ్వాక్రా గ్రూపునకు అప్పగించారు. గ్రూపు లీడరు పి.కృష్ణప్రియ బాధ్యతలు చేపట్టారు. మండల పరిధిలోని దావోజిపాలెం గ్రామానికి చెందిన రేషన్ డీలర్ కె.నాగమల్లేశ్వరరావు కూడా రాజీనామా అందజేశారు. అయితే ఈయన రాజీనామాను అధికారులు ఇంకా ఆమోదించలేదు. పట్టణంలోని మరో మహిళా డీలరు కూడా రాజీనామా చేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది.



విజేత గ్రూపు లీడరు కృష్ణప్రియకు బాధ్యతలను అప్పగిస్తున్న నాగపోతరావు

#### గత ప్రభుత్వంలో హాయిగా ఉన్నాం...

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే హాయిగా ఉన్నామని, ఇప్పుడు ఈ చాకిరీ చేయలేకపోతున్నామనే విషయాన్ని డీలర్లు పేర్కొంటున్నారు. క్వింటాకు రూ.100 చొప్పున ఒక డీలరుకు సుమారు రూ.7 వేల నుంచి రూ.12 వేలు వరకు కమీషన్ వచ్చేది. ప్రస్తుతం వికలాంగులకు, 60 సంవత్సరాలకు పైబడిన వృద్ధుల ఇళ్లకు తీసుకువెళ్లి రేషన్ ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. దీంతో రేషన్ డీలర్లు ఒక హెల్పర్‌ను పెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆ హెల్పర్‌కు రూ.5 వేలు నుంచి రూ.6 వేలు సమర్పించుకోవాల్సి వస్తుంది. ఇంటింటికీ రేషన్ సరుకు తీసుకువెళ్లి ఇవ్వడానికి ఒక్కో డీలరుకు 25 ఇళ్ల నుంచి 150 ఇళ్లకు వెళ్లి ఇంటింటికీ రేషన్ అందించాల్సి వస్తోంది. ద్విచక్ర వాహనంపై ఆయా ఇళ్లకు తిరగడానికి పెట్రోల్ ఖర్చులు రూ.500 నుంచి రూ.వెయ్యి వరకు వెచ్చిస్తున్నారు. అదనంగా చాకిరీ చేయాల్సి రావడంతో ఇంత కష్టం ఎందుకు..రాజీనామాయే బెటర్ అంటున్నారు.

# కోరలు విప్పిన కాల్‌మనీ!

- రూ.85 వేల అప్పునకు రూ.3 లక్షల వరకూ వసూలు
- ఇంకా రూ.15 వేలు ఇవ్వలేదని తండ్రీ కుమారులపై దాడి
- పోలీసులను ఆశ్రయించిన బాధితులు
- వ్యాపారికి అండగా రంగంలోకి దిగిన తెలుగు తమ్ముళ్లు



ప్రభుత్వాస్పత్రిలో చికిత్స చేయించుకుంటున్న స్వామిదాస్



తలకు కుట్లు వేయించుకున్న స్వామిదాస్ కుమారుడు లాజర్

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ నగరంలో కాల్‌మనీ వ్యాపారులు మళ్లీ కోరలు విప్పుతున్నారు. అధికార పార్టీ నేతల అండదండలతో విచ్చలవిడిగా వడ్డీలు వసూలు చేస్తున్నారు. తాము అడిగినంత డబ్బులు ఇవ్వని వారిపై విచక్షణా రహితంగా దాడులకు పాల్పడుతున్నారు. అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇదే విధంగా తండ్రీ కుమారులపై కాల్‌మనీ వ్యాపారి దాడులకు తెగబడ్డ ఘటన వెలుగులోకి వచ్చింది. 57వ డివిజన్ న్యూరాజరాజేశ్వరీపేటకు చెందిన బలసాని స్వామిదాస్ రియల్ ఎస్టేట్‌లో మధ్యవర్తిత్వం చేస్తుంటాడు. కూలీ పనులు చేసుకుంటూ ఉంటాడు. కరోనా వైరస్ సమయంలో ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో చింతా చందు అనే కాల్‌మనీ వ్యాపారి తల్లి వద్ద రూ.85 వేలు అప్పుగా తీసుకొని ఆమెకు నెల నెలా వడ్డీలు కట్టుకుంటూ వస్తున్నాడు. ఆమె రెండేళ్ల క్రితం కాలం చేయడంతో ఆ సమయంలో కూడా అసలులో రూ.20 వేలు ఇచ్చారు. ఆ తరువాత ఆమె కొడుకు చందు తన తల్లికి ఇవ్వాల్సిన డబ్బులు చెల్లించాలని అడిగాడు. మరో రూ.40 వేలు మాత్రమే ఇవ్వాలని స్వామిదాస్ చెప్పగా అవన్నీ తన వద్ద కుదరదని, తమది కాల్ మనీ అని, లక్ష రూపాయలు కట్టాల్సిందేనని గొడవ పడి భయపెట్టాడు. దీంతో చేసేది లేక లక్ష కడతామని ఒప్పుకున్నారు. గతేడాది బుడమేరు వరదల్లో అంతా నష్టపోయామని చెప్పినా కూడా వినకుండా మొత్తం రూ.3 లక్షలకు పైగా అసలు, వడ్డీల చొప్పున డబ్బులు కట్టించుకున్నారు.

#### రూ.15 వేల కోసం తలపగలకొట్టిన వైనం

దఫదఫాలుగా అప్పు తీర్చుకుంటూ వస్తున్న స్వామి దాసు ఇంకా రూ.15 వేలు ఇవ్వాల్సి ఉండడంతో సెప్టెంబర్ ఒకటో తేదీన ఆ డబ్బులు ఇచ్చేస్తానని చెప్పారు. దానికి సరే అని చెప్పిన చందు ఆగస్టు 31వ తేదీన స్వామిదాస్‌కు ఫోను చేసి అసభ్యకరంగా తిడుతూ ఈ రోజే నాడబ్బులు ఇచ్చేయాలి లేకపోతే నిన్ను చంపేస్తా అంటూ కులం పేరుతో బూతులు తిట్టాడు. స్వామిదాసు వారి ఇంటి ముందు వేసిన వినాయకచవితి పందిరి వద్ద ఆదివారం రాత్రి కూర్చొని ఉండగా చందు ఒక్కసారిగా స్వామిదాసుపై దాడికి పాల్పడ్డాడు. అక్కడే ఉన్న స్వామిదాసు కుమారుడు తన తండ్రిని కొట్టవద్దంటూ అడ్డురాగా రాయితో అతని తల పగలకొట్టాడు. ఈ ఘటనలో స్వామిదాసు ముఖంపై, చేతికి, ఒంటిపై గాయాలుకాగా అతని కుమారుడు లాజర్ తల పగిలి కుట్లుపడ్డాయి. బాధితులు పోలీసులను ఆశ్రయించగా చింతా చందు అతని కుటుంబ సభ్యులు పరారీలో ఉన్నారు. కాల్‌మనీ వ్యాపారులకు అండగా టీడీపీ నాయకులు రంగంలోకి దిగి కేసు రాజీ చేసేందుకు ప్రయత్నించారు. వినాయక చవితి బందోబస్తు నేపథ్యంలో దీనిపై ఇంకా కేసు నమోదు చేయలేదని పోలీసులు చెప్పుకొచ్చారు.

# బుడమేరు ముంపు నివారణలో కూటమి వైఫల్యం

**బుడమేరు ముంపు బాధితుల ఐక్యవేదిక ధర్నా**



విజయవాడలోని కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బుడమేరు వరద ముంపు నివారణ చర్యల్లో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఏపీ అర్బన్ సిటిజన్స్ ఫెడరేషన్ కన్వీనర్ సీహెచ్ బాబూరావు ధ్వజమెత్తారు. బుడమేరు వరదల సందర్భంలో హడావిడి చేసిన ప్రభుత్వం ఆ తర్వాత శాశ్వత నివారణ చర్యలను విస్మరించిందన్నారు. బుడమేరు వరద ముంపు నివారణకు శాశ్వత చర్యలు చేపట్టాలని కోరుతూ బుడమేరు ముంపు బాధితుల ఐక్య వేదిక ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా జరిగింది. బుడమేరు వరద ముంపు నివారణకు శాశ్వత చర్యలు చేపట్టాలని, బాధితులందరికీ సహాయం అందించాలని నినాదాలు చేశారు. ధర్నాలో పాల్గొన్న సీహెచ్ బాబూరావు మాట్లాడుతూ 2047 నాటికి ప్రణాళికలు రచిస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం, తక్షణ సమస్యగా ఉన్న బుడమేరు వరదను శాశ్వతంగా నివారించడానికి మాత్రం ప్రణాళికలు రచించడం లేదన్నారు. రూ. 80 వేల కోట్ల ఖర్చుతో బనకచర్ల ప్రాజెక్టును నిర్మించటానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్న ప్రభుత్వం .. బుడమేరు వరద శాశ్వత నివారణకు ఎందుకు చర్యలు చేపట్టటంలేదని ప్రశ్నించారు, ముంపు నివారణకు శాశ్వత చర్యలు తీసుకోని పక్షంలో ప్రజలు ఆందోళన చేయటానికి సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. అనంతరం ముంపు ప్రాంతాలకు చెందిన వివిధ సంఘాల నాయకులు జిల్లా కలెక్టర్ లక్ష్మీశను కలిసి వినతి మెమోరాండం అందజేశారు. మిత్రా కమిటీ సిఫార్సుల ప్రకారం వెలగలేరు రెగ్యులేటర్ కు ఎగువన రిజర్వాయర్లు నిర్మించాలని, బుడమేరు డైవర్షన్ ఛానల్ వెడల్పు పెంచి కనీసం 35,000 క్యూసెక్కులకు పెంచాలని, విజయవాడ నగరానికి ముంపు లేకుండా మరొక అదనపు కాలువ నిర్మించి వరద నీరు ఎప్పటికప్పుడు పోయేవిధంగా ఏర్పాటు చేయాలని, బుడమేరు లోతు, వెడల్పు పెంచి రెండు వైపుల రిటైనింగ్ వాల్ నిర్మించాలని, బుడమేరు పూడికల తీయించి రివెటింగ్ చేయించాలని కలెక్టర్‌కు ఇచ్చిన మెమోరాండంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జె. మంగపతి, యు. వి. కృష్ణయ్య, కార్పొరేటర్ సత్తిబాబు, ఎస్.కే. సలీమ్, పిల్లి మహేష్, వాసు, మాచర్ల లింగరాజు, కే.సరోజ, షకీల, పౌర సంక్షేమసంఘం నాయకులు బి.రమణారావు, పులి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలి



రెడ్డిగూడెం: రెడ్డిగూడెం మండలంలో వైఎస్సార్ సీపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాజీ మంత్రి, మైలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి జోగి రమేష్ తెలిపారు. రెడ్డిగూడెం మండలం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం జరిగిన సమావేశంలో మండల ఎస్సీ సెల్ అనుబంధ అధ్యక్షుడిగా మట్టకొయ్య రామును నియమించి శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా జోగి రమేష్ మాట్లాడుతూ త్వరలో రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్ మోహనరెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకోవాలని తెలిపారు. నూతనంగా మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు నియమితులైన రాము మాట్లాడుతూ మండలంలో అన్ని గ్రామాల్లో పర్యటించి పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. తన మీద నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి జోగి రమేష్, మండలం పార్టీ అధ్యక్షుడు కుప్పిరెడ్డి వెంకటరెడ్డి, నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

# పింఛన్‌లతో సామాజిక భద్రతకు భరోసా

**జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ**



చిల్లకల్లులో పింఛన్ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్

చిల్లకల్లు(జగ్గయ్యపేట): ఎన్టీఆర్ పింఛన్‌లతో పేదల సామాజిక భద్రతకు భరోసా లభిస్తుందని కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. గ్రామంలో ప్రారంభమైన పింఛన్‌ల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పింఛన్‌దారులకు ఇబ్బందులు లేకుండా పంపిణీ చేయాలని సూచించారు. జిల్లాలో 2,30,277 పింఛన్‌లకు గాను దాదాపు రూ. 99.55 కోట్లు అందిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ సిబ్బందితో ఇంటి వద్దనే పింఛన్ అందిస్తున్నామని పేర్కొన్నారు. అత్యంత పారదర్శకంగా ప్రతినెలా పింఛన్‌ల పంపిణీ చేస్తున్నామన్నారు. సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పంపిణీలో పాల్గొంటున్నట్లు తెలిపారు. గ్రామంలోని మూడు కుటుంబాల లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేసి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్, నందిగామ ఆర్డీవో బాలకృష్ణ, డీఆర్‌డీఏ పీడీ నాంచారరావు, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, ఎంపీడీవో నితిన్, ఇన్‌చార్జ్ తహసీల్దార్ మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

## బాలికతో అసభ్య ప్రవర్తన కేసులో ఐదేళ్లు జైలు

ఇబ్రహీంపట్నం: బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన కేసులో పోక్సో కోర్టు జడ్జి వి.భవాని నిందితుడికి ఐదేళ్లు కఠిన కారాగార శిక్ష, రూ.10 వేలు జరిమానా సోమవారం విధించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... 2019 డిసెంబర్ 18న పోలీస్ స్టేషన్ పరిధిలో అనాథ పిల్లలకు ఫండ్ కలెక్ట్ చేసేందుకు వచ్చిన ఓ బాలికను మూలపాడు గ్రామానికి చెందిన బడుగు పాపారావు డబ్బులు ఇస్తానని ఇంట్లోకి తీసుకెళ్లి అసభ్యంగా ప్రవర్తించాడు. బాలిక అతన్ని తోసేసి బయటకు వచ్చి జరిగిన విషయం కుటుంబ సభ్యులకు తెలిపింది. స్థానిక పోలీస్ స్టేషన్‌లో చేసిన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ.శ్రీను కేసు దర్యాప్తు చేసి పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. చార్జి షీట్ దాఖలు చేసిన అనంతరం 8 మంది సాక్షులను విచారించిన కోర్టు నిందితుడిపై నేరం రుజువుకావడంతో జైలు శిక్ష, జరిమాన విధించింది. బాధిత బాలికకు రూ.50 వేలు పరిహారం వచ్చేలా చూడాలని డిస్ట్రిక్ట్ లీగల్ సెల్ ఆథారిటీని ఆదేశించినట్లు సీఐ చంద్రశేఖర్ తెలిపారు.

## పత్తికి మద్దతు ధర ప్రకటించాలి

జి.కొండూరు: పత్తి దిగుమతిపై 11 శాతం దిగుమతి పన్ను రద్దు ఉత్తర్వులను ఉపసంహరించుకొని మద్దతు ధర రూ.10,130ను ప్రకటించాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై.కేశవరావు, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి పీవీ ఆంజనేయులు కోరారు. చెవుటూరు గ్రామంలో పత్తి రైతులతో రైతు సంఘం నాయకులు సోమవారం సమావేశమయ్యారు. పత్తి రైతులు గత కొన్నేళ్లుగా ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

## అందుబాటులో 21,167 టన్నుల ఎరువులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లాలో ఖరీఫ్ – 2025 సీజన్ అవసరాలకు ప్రస్తుతం 21,167 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సీజన్ లో ఇప్పటివరకు 48,158 మెట్రిక్ టన్నులు ఎరువులు రైతులకు సరఫరా చేశామని పేర్కొన్నారు. సోమవారం నాటికి సాధారణ విస్తీర్ణంలో 91 శాతం పంటలు సాగయ్యాయని వెల్లడించారు. మంగళవారం నాటికి జిల్లాకు మరో 1,500 మెట్రిక్ టన్నుల యూరియా వస్తుందని వివరించారు. అదేవిధంగా సెప్టెంబర్ 7వ తేదీలోగా ఇంకో 2,750 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులోకి వస్తుందని చెప్పారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఎక్కువ ధరలకు కొనుగోలు చేయవద్దని, ఏ షాప్ వారైనా ఎక్కువ ధర డిమాండ్ చేసినట్లయితే కలెక్టరేట్ లోని కమాండ్ కంట్రోల్ రూమ్ నెంబర్ 91549 70454 కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు.




## రైతు వ్యతిరేక విధానాలతో సంక్షోభంలో వ్యవసాయం



కొటికలపూడి(ఇబ్రహీంపట్నం): అఖిల భారత రైతు సంఘం డిమాండ్స్ దినోత్సవాన్ని కొటికలపూడిలో సోమవారం ఘనంగా నిర్వహించారు. అఖిల భారత రైతు సంఘం పతాకాన్ని రైతు రైతులు ఆవిష్కరించారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఉపాధ్యక్షుడు మల్నీడి యల్లమందారావు మాట్లాడుతూ 1991 నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలతో వ్యవసాయం సంక్షోభంలోకి నెట్టబడిందన్నారు. వ్యవసాయ సంక్షోభం, రైతుల ఆత్మహత్యల నివారణకు ఎం.ఎస్. స్వామినాథన్ చేసిన సిఫార్సులను కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. ప్రతి ఏడాది పంటలకు మద్దతు ధర లభించక రైతులు నష్టపోతున్నారని పలు సర్వే సంస్థలు వెల్లడించాయని తెలిపారు. స్వామినాథన్ సిఫార్సుల ప్రకారం పంటలకు మద్దతు ధరలు ప్రకటించి, చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. రైతులు జొన్నలగడ్డ కోటేశ్వరరావు, మల్నీడి గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

## కట్టెలేరుపై వంతెన నిర్మించాలని కోరుతూ ధర్నా




తిరువూరు: గంపలగూడెం మండలం వినగడప వద్ద కట్టెలేరుపై వంతెన నిర్మాణ పనులు తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రారంభిస్తామని హామీ ఇచ్చిన ప్రజాప్రతినిధులు ఏడాదిన్నర గడుస్తున్నా పట్టించుకోకపోవడం దారుణమని సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు తూము కృష్ణయ్య పేర్కొన్నారు. వినగడప కట్టెలేరు వద్ద వంతెన నిర్మాణం కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. కట్టెలేరు వరదలకు కొట్టుకుపోయిన వంతెన కారణంగా గంపలగూడెం మండలం నుంచి ఎన్టీఆర్ జిల్లాలోని పలు గ్రామాలకు రాకపోకలు వీలులేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పలుమార్లు ప్రజాప్రతినిధులకు, అధికారుల దృష్టికి తెచ్చినా ప్రయోజనం కరువైందన్నారు. ఎప్పటికపుడు తాత్కాలిక రోడ్లు వేసి చేతులు దులుపుకుంటున్న అధికారులు లక్షలాది రూపాయల ప్రజాధనం వృథా చేస్తున్నారని చెప్పారు. ఇప్పటి వరకు తాత్కాలిక రోడ్లకు చేసిన ఖర్చుతో వంతెన పనులు కొంతమేర పూర్తయ్యేవని కృష్ణయ్య పేర్కొన్నారు. ఏపీ వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుకూరి వెంకటేశ్వరరావు, సీపీఐ నాయకులు నాగుల్‌మీరా, సాంబశివరావు, రామకృష్ణ, వెంకటేశ్వర్లు, రామారావు, భాగ్యమ్మ పాల్గొన్నారు.

# కోలాహలంగా గణనాథుల నిమజ్జనం



నెమలిలో గణపతిని నిమజ్జనానికి తీసుకువెళ్తున్న అధికారులు



జి.కొండూరులో అన్నదానం ప్రారంభిస్తున్న ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ

తిరువూరు: తిరువూరు, మైలవరం నియోజకవర్గాల్లో సోమవారం పలు గణపతి విగ్రహాలను నిమజ్జనం చేశారు. పాతతిరువూరు, రాజుపేటలోని పలు కూడళ్లలో ఐదు రోజుల పాటు పూజలందుకున్న విఘ్నేశ్వరుడ్ని మేళతాళాలతో ఊరేగించి కట్టెలేరులో నిమజ్జనం చేశారు. శ్రీనిధి స్కూలు ఆవరణలో ఏర్పాటు చేసిన గణపతి ప్రతిమను విద్యార్థులు, ఉపాధ్యాయులు కేరింతలు, కోలాట నృత్యాలతో నిమజ్జనానికి తరలించారు. ఊరేగింపులో డీజే సౌండ్ సిస్టమ్ వినియోగించవద్దని పోలీసులు నియంత్రిస్తూ, నిబంధనలు ఉల్లంఘించిన వారి వద్ద డీజే సిస్టమ్‌ను స్వాధీనం చేసుకున్నారు.

**అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎంపీపీ**

జి.కొండూరు: గణపతి నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా జి.కొండూరు ఉమాసుత యువజన సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ సోమవారం రాత్రి ప్రారంభించారు. ఎంపీపీ మాట్లాడుతూ గణపతి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

**వినాయకుని ఆశీస్సులతో సంతోషంగా ఉండాలి**

మైలవరం: వినాయకుని ఆశీస్సులతో అందరూ సంతోషంగా ఉండాలని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ తెలిపారు. రెడ్డిగూడెం మండలంలో పలు చోట్ల ఏర్పాటు చేసిన గణనాథుని విగ్రహాలను ఎమ్మెల్యే సోమవారం దర్శించుకున్నారు. భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్న ఈ ఉత్సవాలు సమాజంలో ఐక్యత, ఆనందం కలిగిస్తాయన్నారు. అనంతరం మైలవరంలో పెన్షన్ లబ్ధిదారులకు పెన్షన్‌లు పంపిణీ చేశారు.

**గంపలగూడెంలో నిమజ్జనం**

తిరువూరు: గంపలగూడెం మండలం నెమలి శ్రీవేణుగోపాలస్వామి దేవస్థానంలో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన గణపతి విగ్రహాన్ని సోమవారం నిమజ్జనం చేశారు. ఆలయం నుంచి స్వామివారి విగ్రహాన్ని మేళతాళాలతో ఊరేగించి అనురాధ వాగులో నిమజ్జనం చేశారు. ఆలయ సహాయ కమిషనర్ సంధ్య, అర్చకులు పాల్గొన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో గణపతి విగ్రహాలను ఊరేగించి నిమజ్జనం చేశారు.



తిరువూరులో వినాయకుడి ఊరేగింపు

## పత్తి దిగుమతులపై సుంకాలను పునరుద్ధరించాలి



జెండా ఆవిష్కరిస్తున్న జమలయ్య, నాయకులు

రాయనపాడు(విజయవాడరూరల్): భారత ప్రభుత్వం విదేశాల నుంచి దిగుమతి చేసుకునే పత్తిపై ఉన్న 11 శాతం దిగుమతి సుంకాన్ని ఎత్తివేయడం దుర్మార్గమని, వెంటనే దిగుమతి సుంకాన్ని పునరుద్ధరించాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అఖిల భారత కిసాన్ కోర్కెల దినోత్సవం సందర్భంగా విజయవాడ రూరల్ మండలం రాయనపాడు గ్రామంలో సోమవారం రైతు సంఘం జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ పత్తిపై దిగుమతి సుంకాలు తగ్గింపు వలన దేశీయంగా పత్తి పండించే రైతులకు తీవ్ర నష్టమన్నారు. ఇప్పటికే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారతదేశం నుంచి ఎగుమతి చేసే ఉత్పత్తులపై 50 శాతం సుంకాలను విధించడం వలన దేశంలోని రొయ్య రైతులకు, ముడి ఆయిల్, ఆయిల్ పామ్ రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులతో పాటు పంట హామీపై స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలు మంజూరు చేయాలని కోరారు. ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పెయ్యల వెంకటేశ్వరరావు, నాయకులు బత్తుల సత్యనారాయణ, జి.దేవరాజు, బి.రాయప్ప, పి.ఐలయ్య, ఎన్.నాగరాజు, అంగిరేకుల భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వం హామీలు అమలుచేయాలి

తిరువూరు: కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీఐటీయూ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అగ్నిపర్తి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక సుందరయ్య భవన్‌లో సోమవారం జరిగిన బిల్డింగ్ వర్కర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరించడానికి ఇంతవరకు ఉత్తర్వులు జారీచేయకపోవడం శోచనీయమన్నారు. కార్మికులకు రావలసిన పెండింగ్ క్లయిమ్‌లను జారీచేయాలని, సహాయ కార్మిక అధికారుల పోస్టులు భర్తీ చేయాలని కోరారు. ఈ నెల 15న తమ సమస్యలపై రాష్ట్ర కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు. సీఐటీయూ నాయకులు భద్రం, షేక్ ఖాసిం పాల్గొన్నారు.

# ఎన్నికల హామీలను కూటమి విస్మరించింది

- ప్రజలే తగిన బుద్ధి చెబుతారు
- వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి స్వామిదాసు


విస్సన్నపేటలో మాట్లాడుతున్న స్వామిదాసు


సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు

**విస్సన్నపేట:** ఎన్నికల హామీలను కూటమి ప్రభుత్వం విస్మరించిందని వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు అన్నారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో సోమవారం వైఎస్సార్ సీపీ మండల స్థాయి విస్తృత స్థాయి సమావేశం, బాబు షూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న స్వామిదాసు మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వం గురించి ప్రజలకు ఇప్పటికే మోసపోయామని గుర్తించారని స్వామిదాసు చెప్పారు. విద్యా వ్యవస్థను, వైద్య రంగాన్ని నాశనం చేస్తున్నారన్నారు. పేద ప్రజలకు అందాల్సిన వైద్యాన్ని అశ్రద్ధ చేస్తున్నారన్నారు. దివంగత మహానేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేకరరెడ్డి ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఎందరో పేదలకు ప్రాణదానం చేశారని చెప్పారు.

**మహిళకు రూ.1,500 ఏవీ ?**

ఏ పార్టీతో పొత్తు పెట్టుకోకుండా గెలిచి ఇచ్చిన హామీలను అమలు చేసి మాట తప్పని మడమ తిప్పని నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని స్వామిదాసు అన్నారు. ఎన్నికల్లో గెలవటానికి కూటమి ప్రభుత్వం హామీలు ఇచ్చే టప్పుడు తెలీదా ఇప్పుడు నిధులు ఎలా అని అంటున్నారన్నారు. సంపద సృష్టిస్తానన్నారు ఏది మీరు సృష్టించిన సంపద అని నిలదీశారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు రూ.1,500, 50 ఏళ్లు నిండిన వారికి పింఛన్లు ఇస్తామన్నారు. ఎక్కడ అమలు చేస్తున్నారని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దిరెడ్డి సూర్యనారాయణరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఓలేటి దుర్గారావు, పట్టణ అధ్యక్షుడు నెక్కళపు కుటుంబరావు, గ్రామ సర్పంచ్ సాధు పాటి నాగమల్లేశ్వరి, వైస్ ఎంపీపీలు గాజుల శ్రీనివాసరావు, రెడ్డి శ్రీనివాసరావు, పార్టీ సీనియర్ నాయకులు సిరసాని ప్రకాష్, దోర్నాల దామోదర రెడ్డి, ముంగా జయరాజు, నాగేశ్వరరావు, మల్లయ్య, తాణంకి రాంబాబు, చింతల ప్రసాద రెడ్డి, పల్లెపాం లక్ష్మయ్య, చంద్రశేఖరరావు, కోఆప్షన్ సభ్యుడు జాఫర్‌బాబా, దస్తగిరి, భూక్యా రాము, అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## బైక్‌లతో పట్టుబడ్డ మైనర్లకు కౌన్సెలింగ్



**ఇబ్రహీంపట్నం:** లైసెన్స్‌లు లేకుండా ద్విచక్ర వాహనాలు నడుపుతున్న మైనర్లకు ట్రాఫిక్ ఎస్‌ఐ లక్ష్మణరావు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇటీవల కాలంలో కురిసిన వర్షాలకు ఇబ్రహీంపట్నం, కొండపల్లి, కిలేస్‌పురం గ్రామాల్లో వాటర్‌ఫాల్స్, మూలపాడులో బటర్‌ఫ్లై పార్క్ వంటి పర్యాటక ప్రాంతాలకు వచ్చే సందర్శకుల వాహనాలను సోమవారం ట్రాఫిక్ ఎస్‌ఐ తనిఖీ నిర్వహించారు. తనిఖీలో వాహన రికార్డులు, లైసెన్స్‌లు లేని మైనర్లు ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు. పట్టుబడిన మైనర్లకు జరిమానాలు విధించడంతో పాటు, తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇచ్చారు. మైనర్లు వాహనాలు నడపడం వలన వారి ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలకు కూడా ముప్పు వాటిల్లుతుందన్నారు. మితిమీరిన వేగం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్, సైలెన్సర్లు తీసి విన్యాసాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## 5న జాబ్‌మేళా

**తిరువూరు:** స్థానిక వాహినీ ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 5వ తేదీన జాబ్ మేళా జరుగుతుందని ఎమ్మెల్యే కె.శ్రీనివాసరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ పాసైన లేదా ఫెయిలైన నిరుద్యోగ అభ్యర్థులు ఈ మేళాలో పాల్గొనాలని, ఉదయం 9 గంటలకు జరిగే మేళాకు అన్ని విద్యార్హతల ధ్రువీకరణ పత్రాలు, బయోడేటాతో హాజరు కావాలని సూచించారు.

## నేడు మాజీ సీఎం వైఎస్సార్ వర్ధంతి

**మైలవరం:** ఏపీ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి 16వ వర్ధంతి కార్యక్రమం మైలవరంలోని ఎల్‌హెచ్ కాంప్లెక్స్ వద్ద మంగళవారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గర్నేపూడి వెంకట్రావు తెలిపారు. మాజీ మంత్రి, నియోజకవర్గ ఇన్‌చార్జి జోగి రమేష్ కార్యక్రమంలో పాల్గొని వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తారన్నారు. అనంతరం జోగి రమేష్ చేతుల మీదుగా అన్నదాన కార్యక్రమం జరుగుతుందన్నారు. పార్టీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**జి.కొండూరు:** మండల పరిధిలో 40 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.23.89 లక్షల ఆర్థిక సాయం చెక్కులను స్థానిక కమ్యూనిటీ హాలులో ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్ సోమవారం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటి వరకు నియోజకవర్గంలో 1,069 మంది లబ్ధిదారులకు రూ.8.29 కోట్లను అందజేశామన్నారు.

## కరాటే కోచ్‌కు అభినందన



**తిరువూరు:** విద్యార్థులకు కరాటే నేర్పించడంలో ప్రతిభ కనబరుస్తున్న తిరువూరుకు చెందిన కోచ్ మరకాల రేవంత్ బోధి ధర్మ అవార్డు సాధించినందుకు సోమవారం పలువురు ఉపాధ్యాయులు అభినందించారు. విజయవాడలో ఇటీవల జరిగిన జాతీయస్థాయి కరాటే యూత్ ఐకాన్ స్టార్ ఎక్స్‌లెన్సీ అవార్డుల ప్రధాన కార్యక్రమంలో జిల్లా ఉషు అసోసియేషన్ కార్యదర్శి సీబీ వెంకట్ నుంచి రేవంత్ బోధి ధర్మ అవార్డు అందుకున్నారు.

## కార్మికుల సంక్షేమ బోర్డును పునఃప్రారంభించాలి

**మైలవరం:** కార్మికుల సంక్షేమ బోర్డును పునఃప్రారంభించాలని జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి అప్పారావు తెలిపారు. మైలవరంలోని యూనియన్ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో అప్పారావు మాట్లాడుతూ సంక్షేమ బోర్డును తిరిగి ప్రారంభించి భవన నిర్మాణ కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఈ నెల 15న విజయవాడలోని రాష్ట్ర లేబర్ కమిషన్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని పిలుపునిచ్చారు.